# ఎదురుప్రశ్న

తెల్లవారగానే రామం అరుగు మీద లేచి కూర్చున్నాడు. బొబ్బర్లంక పోయే స్టీమరు ప్రొద్దున్న ఏడు గంటలకు బయలుదేరుతుంది. నిన్న సాయంత్రం అందుకుందామనుకున్న స్టీమరు, రైలు ఆలస్యం వల్ల దాటిపోయింది. ఈ స్టీమరైనా అందుకోవాలని రామం లేచి ఒంటిన ఉన్న దుమ్ము, ధూళి దులుపుకుని, పంట్లాము మోకాలు దాకా యథాప్రకారం పెట్టుకుని చేతిలో గొడుగు త్రిప్పుకుంటూ గోదావరి ఒడ్డుకు బయలుదేరాడు.

రామం తన 14 ఏండ్ల జీవితంలోనూ రాజమండ్రి రావడం అదే మొదటిసారి. నిన్న సాయంత్రం స్టీమరు దాటి పోయాక "వెంకట్రామయ్య బాబయ్య, సత్తెమ్మత్తయ్య, యీ వూళ్ళో ఉండాలే" అనుకున్నాడు ఈ రాత్రి బాబయ్యగారి యిల్లు కనిపిస్తే అక్కడ ఉండిపోదామని ఊరంతా గాలించాడు. బాబయ్య పూర్తి ఎడ్రసు తెలియక కనిపించిన ప్రతీవాణ్ణి అడిగాడు ' ఫలానా వెంకట్రామయ్యగారు ఎక్కడ ఉంటారో తెలుసా" అని అంత పట్నంలో ఒక మనిషి గురించి ఎవరు చెప్పగలరు? చివరికి బాబయ్యగారి యిల్లు కనిపించక, రాత్రి హోటల్లో భోంచేసి ఓ సినిమా చూసి, కనిపించిన ఒక వీధి అరుగుపైన పడుకున్నాడు రామం.

"బాబయ్య యింక ఎలాగు కనిపించడు" అని నిరాశ చేసుకుని, స్టీమరు అందుకోడానికి చక చకా గోధావరి గట్టు చేరుకున్నాడు. రామం స్టీమరు వైపు నడిచి వెడుతూంటే ఆ ప్రక్కనున్న స్నానాల రేవులో తన బాబయ్యలా ఎవరో కనిపించారు. రామం ఒకసారి తేరిపార చూశాడు. "ఇంకెవరు? బాబయ్యే!" అని ఆనందంతో లోలోపల పొంగిపోయాడు.

వెంకట్రామయ్యగారు గోదావరిలో స్నానం చేస్తూ సంధ్యా వందనం చేసుకుంటున్నారు. తక్షణం పలకరిస్తే ఆయన జపం చెడుతుందని రామం గోదావరి గట్టుపై బాబయ్య కోసం నిరీక్షిస్తూ కూర్చున్నాడు, స్టీమరు బయలుదేరడానికి ఒక అరగంట ఆలస్యం ఉందని తెలిసి.

బాబయ్యను చూసి మూడేళ్ళయింది. నాన్న పోయినప్పుడు యింటికి వస్తే, ఆయన్ని చూశాడు. బాబయ్యని పలకరించి అమలాపురంలో పని ముగించుకుని తిరిగి వచ్చేటప్పుడు బాబయ్య గారింట్లో రెండు రోజులుండాలి...సత్తెమ్మత్తయ్య కూడా యిక్కడే

వుందిట... అత్తయ్య చాలా మంచిది.. బాబయ్య గారి రత్తప్ప, చంటి, యిప్పుడేం చేస్తున్నారో? చూసినప్పుడల్లా వాళ్ళు కథలు చెప్పమని పీక్కుతింటారు. వాళ్ళతో మళ్ళీ ఒకసారి దాగుడుమూతులు ఆడుకోవాలి. అని పురాతన స్మృతులూ, బంధువుల అభిమానాలు నెమరు వేసుకుంటూ కూర్చున్నాడు రామం.

వెంకట్రామయ్యగారు స్నానం, జపం పూర్తి చేసుకుని, ఒక తడి అంగోస్త్రం నెత్తిన వేసుకుని, మోకాలు దాకా మరొక తడి అంగవస్త్రము కట్టుకుని, చేతిలో ఒక చెంబు నిండా గోదావరీ జలం తీసుకుని, గట్టుపైకి వచ్చారు "ఎన్నాళ్ళకు బాబయ్యను కలుసుకున్నాను'' అనుకుంటూ ఆనందంతో ఉవ్విళ్ళూరుతూ, ఆత్రంతో ఎదురుచూశాడు రామం. వెంకట్రామయ్యగారు ఏదో జపం చేసుకుంటూ, గట్టు ఎక్కి, రామం ప్రక్కనుంచి నడిచి వెళ్లిపోసాగారు.

బాబయ్య తనకేసి చూసికూడా మాట్లాడకుండా ఉండటం రామంకు అర్థం కాలేదు. ఒకవేళ తనకేసి సరిగా చూశాడా లేదా అని అనుమానం కలిగి వెంకట్రామయ్యగారు వెళ్ళిపోతూంటే "బాబయ్యా, బాబయ్యా!" అని కేకలేశాడు రామం. కేకలు విని వెంకట్రామయ్యగారు వెనుదిరిగిచూశారు. కాని తనను కాదన్నట్లుగా, తిరిగి నడిచి వెళ్ళి పోసాగారు.

బాబయ్య ప్రవర్తన చూసేటప్పటికి, రామం ఆనందం, బంధుప్రేమ, పటాపంచలయ్యాయి హృదయంలో ఏదో బాధ, అవమానం, విజృంభించి, మనస్సును చీకాకుపరిచాయి. బాబయ్య పిలిచినా పలకకపోడం రామంకు అర్థంకాలేదు. అంత నిరసనగా తృణీకరింపబడినందుకు ఏడుపు కూడా వచ్చింది రామంకు.

మరొకసారి ఎదురుగా వెళ్ళి పిలిచే ప్రయత్నం చేదామని ఉరకలు వేసుకుంటూ, గొడుగు యీడ్చుకుంటూ, వెంకట్రామయ్య గారికి అడ్డంగా వెళ్ళి "బాబయ్యా" అని జాలిగా పలకరించాడు రామం. వెంకట్రామయ్యగారు హఠాత్తుగా నిలబడిపొయ్యారు.

"బాబయ్యా....నేను...నేను" అన్నాడు రామం దీనంగా.

"ఎవరు నువ్వు?" అన్నారు వెంకట్రామయ్య గారు; ఏదో ఓ అపరిచయుణ్ని ప్రశ్నిస్తున్నట్లు.

"ఎవరు నువ్వు?" అని ఏమీ ఎరగనివానిలా బాబయ్య వేసిన ప్రశ్న గుండెల్లో శూలంలా గ్రుచ్చుకుంది రామంకు. ఇంక ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఎంతో అభిమానంతో ఊరంతా గాలించి, చివరికి యిక్కడ కలుసుకుని సంతోషంగా మాట్లాడుదామని ఉబలాటపడుతూన్న ఆ అమాయిక హృదయానికి

వెంకట్రామయ్యగారి ప్రవర్తన అంతా అయోమయంగా ఉంది. తనలాంటి నిర్భాగ్యుణ్ణి పరాయివారు కూడా జాలి కలిగి ఆదరిస్తూంటే తన తండ్రి తమ్ముడు యింత నిర్లక్ష్యంగా "ఎవరు నువ్వు" అంటాడని రామం కలలో కూడా అనుకోలేదు.

"బాబయ్యా!..నేను...నేను...మరిచిపోయావా?" అన్నాడు రామం హృదయంలో ఏదో అవ్య క్తమైన బాధ ఉడికి ఉబుకుతూంటే. రెండు వేడికన్నీటి బిందువులు పొంగి కిందకు రాలాయి.

వెంకట్రామయ్యగారు నిశ్చేష్టులై అలాగే నిలుచుండి పోయారు. ఆయన ప్రవర్తన చూసి, అవమానంతో ఆత్మాభిమానంతో కుంగిపోయాడు రామం.

స్టీమరు కూత కూసింది బయలుదేరుతున్నానని చెబుతూ.

రామం గిరుక్కున తిరిగి, గొడుగు ఈడ్చుకుంటూ, గబగబ స్టీమరు ఎక్కేశాడు. వెంకట్రామయ్య గారు అలా నిలుచుండి ఆశ్చర్యంగా స్టీమరు ఎక్కే రామం వైపు చూశారు.

స్టీమరు ఎక్కాక కూడా "ఎవరు నువ్వు?" అన్న బాబయ్య మాటలు రామం చెవుల్లో గింగురు మంటున్నాయి బంధువులనే వాళ్ళల్లో అభిమానాలు యిలాగే వుంటాయా అనిపించింది రామంకు. తన తండ్రి చనిపోయి మూడేళ్ళయింది. నాన్నకు అప్పుడు పిరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా చనిపోతాడని తెలుసుకున్నా, బాబయ్య నాన్నను చూసి వెళ్ళిపోయాడని అమ్మమ్మ చెప్పింది. కాని నాన్నకు తను అంత్యక్రియలు జరుపుతూంటే ఆ పన్నెండు రోజులు బాబయ్య తన కుటుంబంతో సహా తన దగ్గరే వున్నాడు. నాన్న పోయినప్పుడు తన దూరపు బంధువు సుబ్బమ్మగారు "చచ్చినవాడు నిక్షేపంలా ఆస్తి అతా తగలబెట్టి చచ్చిపోయాడుగాని, ఈ సంసార భారమంతా నీ నెత్తిన పడుతూందిరా! వెంకటేశం!" అని తన పెదమామతో అన్న గుసగుసలు తన హృదయంలో రేపిన గాయాలు యిప్పటికీ స్ఫురణకు వస్తూంటాయి. తండ్రి పోయాక తన పోషణ తన పినమామ చూస్తూంటే తక్కిన వాళ్ళకు యింత ఉక్రోషం,అసూయ, ఎందుకో, రామానికి అర్థం కాలేదు. ఇంతకీ నిలవడానికి నీడలేని పక్షుల్లాంటి తన కుటుంబానికి తన పినమామ ద్వారా కొద్ది ఆధారం దొరకడం నిజంగా అదృష్టం కాని ఈ అదృష్టం ముఖ్యావసరం గూడా తన కుటుంబం ముష్టెత్తుకోకుండా బ్రతకాలంటే.

బంధువుల గురించి తలచుకున్నకొద్దీ రామంలో బాధ, ఉక్రోషం, పెరిగిపోతున్నాయి. తాను ఎంత అభిమానంగా, ఆనందంగా, తన బంధువులతో మాట్లాడుదామనుకున్నా,

అంత నిరసనగా వాళ్ళు తన్ను చూడ్డం చాలాసార్లు గమనించాడు రామం. "మీరు సహాయం చెయ్యడం వల్ల, మామయ్య వద్ద నుంచి మునుపు వాళ్ళు పొందే సహాయం ఆగిపోయిందని అందరికీ అసూయ మీరంటే" అని అమ్మమ్మ అప్పుడప్పుడు అంటూండేది అది నిజమే. ఒకనాడు తన మేనబావ ఎత్తి పొడిచాడు. "నువ్వు మాకు శనిగొట్ట పీనుగులా దాపురించావు. నీ మూలానే నామ్ముందు చదువు ఆగిపోయింది" అని.

"అయినా నేను బాబయ్యను సహాయం అపేక్షించి పలకరించలేదే. ఎందుకు నన్ను "ఎవరు నువ్వు" అని అడిగాడు బాబయ్య! మానవ హృదయం ఉన్నవాడెవడైనా అంత దగ్గరి బంధువుని అలా ప్రశ్నించగలడా? బాబయ్య ఎలా అనగలిగాడు ఆ మాట? అని ఎదురు ప్రశ్న వేయగలనా? నేను మాత్రం వేయలేనే" అనే చిక్కు ప్రశ్నల్లో గిలగిలా మనస్సులో తన్నుకున్నాడు రామం.

"ఇంత నీచంగా చూసే బాబయ్యతో మాట్లాడడం యిదే ఆఖరుసారి ఎంత బీదవాణ్ణయినా ఆత్మగౌరవం ఉండాలి. అని నిశ్చయించుకున్నాడు రామం. అతని నిశ్చయానికి జేజే ధ్వనులు కొడుతున్నట్లు పెద్ద పెద్ద కూతలు వేసుకుంటూ స్టీమరు గోదావరి నీళ్ళను చీల్చుకుంటూ రివ్వున పరుగెత్తింది.

అమలాపురం వెళ్ళి పెద మామయ్యకు అమ్మ యివ్వమన్న డబ్బు యిచ్చి యితర కుటుంబ విషయాలు మాట్లాడి పని ముగించుకుని, రామం తిరుగు దారిలో రాజమండ్రి చేరుకున్నాడు ఈసారి బాబయ్యగారి ఇంటికి వెళ్లకూడదని నిశ్చయించి, హోటలుకు బయలుదేరాడు భోజనం చేదామని.

దారిలో సగం దూరం వచ్చేటప్పటికి ప్రక్క వీధినుంచి యిద్దరు ఆడమనుషులు మరో యిద్దరితో కలిసి తనకు యెదురుగా వస్తుండడం రామం చూశాడు. ఇంకెవరు? అత్తయ్య, పిన్నమ్మ, చంటి, రత్తప్ప! రామానికి సత్తెమ్మత్తయ్యతో మాట్లాడాలనిపించింది. అత్తయ్య చాలా మంచిది. కాని పిన్నమ్మ కూడా ప్రక్కన ఉంది. తీరా పలకరిస్తే వాళ్లు కూడా "ఎవరు నువ్వు" అంటే రామంకు ఆత్మాభిమానం వెన్నంటింది వీళ్ళందరి చేతయింత నీచంగా చూడబడే దానికంటే, మాట్లాడకుండా పోవడం మంచిదని నిశ్చయించుకున్నాడు. గొడుగు అడ్డం పెట్టుకుని, బుర్ర వంచుకుని, బంధువులను చూడకుండా చదచరా నడిచి వెళ్ళిపోయాడు.

రామం ప్రక్కనుంచి గబుక్కున కేక వినిపించిది. "రామం రామం!" అని.

రామం ఆశ్చర్యంతో ఆగిపోయాడు. సత్తెమ్మత్తయ్య పిలుస్తోంది. సత్తెమ్మత్తయ్య

చాలా మంచిది. తను అభిమానంగా పిలుస్తోంది. "మాట్లాడాలి అత్తయ్యతో" అని అడుగులేశాడు రామం.

ఈ లోపుగా సత్తెమ్మగారే ఎదురుగా వచ్చింది. ఏరా! రాము! నిన్ను ఆదూరాన్నుంచే గుర్తుపట్టాను. రాజమండ్రి ఎప్పుడు వచ్చావురా? ఇంటికి రాకుండా వెళ్ళిపోతున్నావు నిన్ను చూసి మూడేళ్ళయింది ఎంత పెరిగావనుకున్నావు. అమ్మవాళ్ళు యిప్పుడు ఎక్కడ ఉంటున్నారు. నాన్న పోయిన తర్వాత మీజాడ అసలే తెలియలేదు మాకు అంది సత్తెమ్మగారు పలవల విచారిస్తూ.

పనిమీద అమలాపురం వెళ్ళివస్తున్నాను. పెదమామయ్య అక్కడ ఉంటున్నారు. ఈవేళ సాయంత్రం యింటికి పోతున్నా రైలులో అన్నాడు రామం.

"అయితే ఎక్కడ ఉంటున్నారు మీరిప్పుడు" అంది రామం పిన్ని విస్తుపోయి.

"కాకినాడలో" అన్నాడు రామం. పిన్ని పలకరించినందుకు ఆశ్చర్యపోతూ.

'అదేమిటిరా యీవేళే యింటికిపోతావా. ఒక్కపూటైనా మాయింట్లో ఉండకుండా' అంది సత్తెమ్మగారు.

"ఎందుకులే నాకు యింటిదగ్గర పనుంది. వెళ్ళిపోవాలి" అన్నాడు రామం.

"రామం, నామాట విను ఒక్కపూట యిక్కడే ఉండి యింటికెళుదువుగాని" అని సత్తెమ్మగారు బలవంత పెట్టింది.

రత్తప్ప, చంటి, రామం చుట్టూమూగి "ఈ వేళకు ఆగు, ఆగు రామం అన్నయ్యా!" అనడం మొదలెట్టారు.

"ఆగరా రామం; మొన్న గోదావరి ఒడ్డున నువ్వు కనిపించావుట కదూ! మీ బాబయ్య సరిగా గుర్తుపట్టలేక పోయారుట. ఇంటికి వచ్చి నువ్వే అయి వుంటావని ఎంతో నొచ్చుకున్నారు. ఒకసారి యింటికి రారా!" అంది రామం పిన్నమ్మ అందరూ రమ్మని బలవంతపెడుతూంటే తను ఊరుకోడం మర్యాద లోపమవుతుందని భయపడ్డాడు.

పిన్ని యీ మాట అనగానే, బాబయ్య నిజంగా పొరబాటున గుర్తు పట్టలేదేమో అనుకున్నాడు రామం. అయినా యింత చిన్న విషయం గురించి యింటికి వెళ్లకపోవడం బాగుండదనుకున్నాడు. రత్తప్ప, చంటి తన్ను రమ్మని పట్టుకు పీకుతూంటే వాళ్ళకోసమైనా యింటికివెళ్ళి వాళ్లతో ఆ కాసేపు ఆడుకోవాలనిపించింది రామంకు. సత్తెమ్మత్తయ్య "రారా" అని బ్రతిమాలుతోంది. " అత్తయ్య చాలా మంచిది. అత్తయ్య

మాట వినాలి అనుకున్నాడు రామం. వారందరితో కలిసి వెంకట్రామయ్యగారి యింటికి వెళ్ళాడు ఆఖరుకు.

ఇంటికి వెళ్ళగానే వెంకట్రామయ్యగారు రామాన్ని పలుకరించి ఏరా! మొన్న నిన్ను సరిగా గుర్తుపట్టలేక పోయాను. మీ నాన్న పోయినపుడు నీకు పూర్తిగా జుట్టు తీయించారుకదూ అప్పుడు చూశాను నిన్ను. ఇప్పుడు ఒత్తుగా జుట్టు పెరిగింది. మనిషి కూడా బాగా పెరిగావు. అందువల్ల ఎవరో అనుకున్నాను అంతమాత్రానికే గిరుక్కున వెనక్కి తిరిగిపోయి స్టీమరు ఎక్కేశావు. మనవంశానికున్న కోపం ఆత్మగౌరవం అంతా నీలోనే ఉన్నాయిరా అన్నారు గుక్కతిప్పుకోకుండా.

"దానికేంలే బాబయ్యా!" అంటూ రామం లోపలికి వెళ్ళాడు. పిన్ని భోజనానికి రమ్మంది. ఎండలో తిరిగి తిరిగి ప్రయాణం చేయడంవల్ల ఒళ్ళంతా తిరుగుతున్నట్లుంది రామంకు.

భోజనానికి కూర్చున్నాడు. కంచంలో మాడిపోయిన పెసరట్లు కనిపించాయి. అన్నం అంతా చల్లగా ఉంది.

"అన్నం బాగా చల్లగా ఉందేం పిన్నీ" అన్నాడు రామం, చలిది అన్నం తినడం అలవాటులేక.

"మీ బాబయ్యకు తెల్లవారగానే అన్నం వండిపెట్టాలిరా ప్రొద్దున్న వండిన అన్నం అవడంవల్ల బాగా చల్లబడి పోయిందనుకుంటాను.

"పోనీ ఒక సోలెడు బియ్యం ఉడకెయ్యలేకపోయావుటే" అంది సత్తెమ్మగారు.

హోటలుకు పోయినా వేడి అన్నం దొరికేదే" అత్తయ్య మాత్రం చాలా మంచిది. వేడి అన్నం పెట్టమంది. అనుకుంటూ గబగబ రెండు మెతుకులు నోట్లో వేసుకుని భోజనం ముగించాడు రామం.

నాన్న పోయాక మిమ్మల్ని విశాఖపట్టణం తీసికెళ్లాడుగదూ మీ పిన
మామయ్య....మళ్ళీ యీ వైపుకు ఎప్పుడు వచ్చారురా" అంది సత్తెమ్మగారు.

"అవును ఒక ఏడు అక్కడ ఉన్నాం తరువాత మామయ్యకు ఆముదాలవలస బదిలీ అయిపోయింది అక్కడ నాకు చదువుకునే బళ్లు లేవని ఈ ప్రాంతాలకి మమ్మల్ని పంపించేశారు. ఇప్పుడు ప్రతీనెలా డబ్బు పంపిస్తున్నారు మమయ్య. నేను యిప్పుడు స్కూలు ఫైనలు చదువుతున్నా కాకినాడలో" అన్నాడు రామం తన చదువు గురించికూడా ఒక ముక్క జతచేస్తూ. పిన్ని ఈ మాటలు విని మూతి విరుచుకుంది.

"అబ్బో, స్కూలు పైనలు చదువుతున్నావురా అప్పుడే! అన్నారు వెంకట్రామయ్యగారు.

"ఎలాగయినా రామం మంచి బుద్ధిమంతుడు. మనవంశంలోకల్లా వీడొక్కడే మగపిల్లవాడైనందుకు ఏదో వృద్ధిలోకివస్తే అంతేచాలు" అంది సత్తెమ్మగారు.

వెంకట్రామయ్య గారికి ఐదుగురు ఆడపిల్లలు. మగసంతానం మాత్రం లేదు. మొదటి ముగ్గురు ఆడపిల్లలకీ పెళ్ళిళ్లు చేశారు. కాని అందులో ఒక అల్లుడు చనిపోయాడు. మరొక అల్లుడికి మతి చెడింది. మూడో అల్లుడు భార్యను విడిచి లేచిపోయాడు. రత్తప్ప చంటి మిగిలారు యింకా పెళ్ళిళ్ళకు.

రామం తండ్రి వెంకట్రామయ్యగారు, సత్తెమ్మగారు, ఒక కడుపున పుట్టారు. సత్తెమ్మగారు బాల్యంలోనే వితంతువయింది. వెంకట్రామయ్య గారికి మగసంతానం లేకపోవడంవల్ల రామం ఒక్కడే ఈ వంశానికి మగపిల్లవాడు. రామం తండ్రి చనిపోయాక సత్తెమ్మగారు, వెంకట్రామయ్యగారింట్లోనే ఒక పంచ కాపురం ఉంటోంది. తనకువచ్చే మనువర్తితో కాలక్షేపంచేస్తూ. కాని అంతకుముందు సత్తెమ్మగారు, రామం యింట్లోని ఉండేది. రామాన్ని చిన్నప్పటినుంచి పెంచి పెద్దచేసింది. అందుచేత రామం అంటే సత్తెమ్మగారికి చాలా అభిమానం.

సత్తెమ్మగారు తనను పొగడ్డంతో రామంకు చాలా సంతోషమయింది. "అత్తయ్య చాలా మంచిది" అని లోలోపల ఉప్పొంగిపోయాడు.

రత్తప్ప, చంటి, కథలు చెప్పమని రామాన్ని వేపుకు తిన్నారు. వాళ్లకు కథలు చెబుతూ ప్రయాణబడలికవల్ల నిద్రపోయాడు రామం.

నిద్రపోయి లేచేటప్పటికి ఒళ్ళంతా నెప్పులు తలనొప్పి ప్రారంభించాయి రామంకు. కొంచెం జ్వరం తగిలినట్లు అనుమానం కలిగింది.

"రామం! ఈ రాత్రి మా యింటికి భోజనానికి రారా". అంది సత్తెమ్మగారు ఆప్యాయంగా. అత్తయ్య మంచితనం గురించి లోలోపల మళ్ళీ ఆనందించాడు రామం.

"ఒంట్లో బాగులేనట్లుంది అత్తయ్యా!" అన్న రామం మాట వినగానే సత్తెమ్మగారు ఆశ్చర్యపోయి, అతని ఒళ్ళు వెచ్చదనం చూసి జ్వరం వచ్చిందని నిర్ణయించింది. ప్రక్కవీధిలో ఉన్న ఆచారి గారి వద్దనుంచి మాత్ర తీసుకువస్తానని వెంకట్రామయ్యగారు బయటికి వెళ్లారు.

"ఇదేమిటిరా! ఇంతట్లో యిలా జ్వరం వచ్చింది!" అంది సత్తెమ్మ గారు రామం దగ్గరగా కూర్చుని అభిమానంతో ఒల్లు నిమరడం మొదలెట్టింది. "వచ్చి వచ్చి, మా

యింట్లో జ్వరం తెచ్చుకున్నాడేమిటి" అని పిన్ని ప్రక్కయింటి అమ్మలక్కలతో గుసగుసలాడింది.

"ఇక్కడకు యెందుకు వచ్చానా! యిక్కడకు రాకుండా ఉంటే జ్వరం రాకుండా ఉండేదేమో" అని వ్యధపడ్డాడు రామం. ముఖ్యంగా అత్తయ్యగారింట్లో ఒక పూట ఉండి, రత్తప్ప, చంటితో ఆడుకుందామనుకున్న రామం. యిలా జ్వరం వచ్చి అందరికీ కష్టం కలిగించేటట్లు మంచమెక్కవలసి వచ్చినందుకు చాలా సిగ్గుపడ్డాడు.

సాయంత్రంఐనకొలదీ జ్వరం తీవ్రత హెచ్చింది. వెంకట్రామయ్యగారు మాత్ర తీసుకువచ్చి యిచ్చారు. కషాయంతో మాత్ర వేసుకుని నిద్రపోదామని కన్ను మూసాడు రామం. నిప్పులా కాగుతూన్న రామం ఒళ్ళు చూసేటప్పటికి, సత్తెమ్మగారికి రామం మీద ఆపాయ్యత, జాలి, మరీహెచ్చి రాత్రి భోజనం కూడా మాని అతని మంచం దగ్గరే కూర్చుంది.

రెండు రోజులైనా జ్వరం తీవ్రత తగ్గే సూచనలేవీ కనిపించలేదు. గంటలు తిరిగినకొద్దీ రామంలో క్రొత్తక్రొత్త మార్పులు కనిపించసాగాయి. మొన్న సరిగా మాట్లాడలేకపొయాడు. ఈవేళ ఆ మాట తీరు కూడా సరిగా లేదు; ఒక వెట్టిచూపు మాత్రం తప్ప. శరీరం బాగా వేడెక్కి ఉడికిపోతూంది. అప్పుడప్పుడు రామం నోటి వెంట తప్పుడు మాటలు కూడా వస్తున్నాయి.

ఈ విషమ పరిస్థితి చూసేటప్పటికి సత్తెమ్మగారి గుండెల్లో విపరీతమయిన బాధ కలిగింది, ఒరే వెంకట్రామయ్య అన్నయ్యా! రామం తల్లికి ఒక టెలిగ్రాం యిద్దా వీడిపరిస్థితి యింకా ముంచుకుపోతూంది. అని వలవల కన్నీరు కార్చింది సత్తెమ్మగారు. తనే కాకినాడవెళ్ళి, రామం తల్లిని తీసుకువస్తానని బయలుదేరారు వెంకట్రామయ్యగారు.

తెల్లవారు ఝాము రైలుబండిలో, రామం తల్లి, అతని అమ్మమ్మ వెంకట్రామయ్యగారితో యింటికి వచ్చారు.

రామం పూర్తిగా యీ లోకం సంగతి తెలియని స్థితిలో ఉన్నాడు. సంధి ప్రేలాపన తీవ్రంగా ఉంది. కాళ్లు చేతులు క్రమంగా చల్లబడుతున్నాయి. చల్లబడిన శరీరాంగాలను ఎఱ్ఱచీమలు పట్టుకు పీకుతున్నాయి.

రామం తల్లి, తన కొడుకు పరిస్థితి చూసేటప్పటికి గొల్లుమని ఏడుస్తూ, అతని మంచం మీద వ్రాలింది. కడుపు తరుక్కుపోయే శోకంతో "రామం!రామం!" అనిపిలిచింది.

"ఆఁ..ఆఁ..." అన్నాడు రామం.

"రామం మీ అమ్మ, అమ్మమ్మ వాచ్చారురా" అంది సత్తెమ్మగారు కన్నీరు తుడుచుకుంటూ.

"అమ్మ...అమ్మ...ఊ...ఎవరూ?" అన్నాడు రామం.

తను వచ్చిన పరిస్థితి కూడా తెలియకుండా సంధిలో ఉన్న కొడుకును చూసేటప్పటికి, ఏదో అవ్యక్తమైన ఆవేదన కడుపులో కోత కోసినట్లయింది రామం తల్లికి. కట్టలు తెంపుకు వచ్చే గోదావరి వరదల్లా ఉబికి వచ్చే కడుపుశోకంతో ఆమె స్తంభించిపోయింది. అమ్మమ్మకు ఏం చెయడానికి తోచక, చంటిపిల్లలా ఏడ్వటం మొదలు పెట్టింది.

డాక్టరు వచ్చి, రామం నాడి పరీక్షించాడు. ప్రక్కకు తిరిగి ఆశలేదు" అన్నాడు వెంకట్రామయ్యగారితో.

ఆ విషాద దృశ్యం చూసేటప్పటికి, వెంకట్రామయ్యగారి కంటిలో రెండు నీటి కన్నీటి చుక్కలు మొలిచాయి.

"యింకేముంది, మన వంశం నాశనమైపోయింది." అంది సత్తెమ్మగారు, గద్గద స్వరంతో విలపిస్తూ.

వెంకట్రామయ్యగారు రామం ప్రక్కలో చేరి "రామం! రామం!" పలకరించారు.

"మామయ్యా! చూశావా! బాబయ్య నన్ను "ఎవరు నువ్వు" అనడిగాడు" అంటూ బాధతో యేదో గొణిగాడు రామం.

"రామం! రామం!" అంది సత్తెమ్మ దగ్గరగా వచ్చి రామం తల నిమురుతూ.

"మామయ్యతో చెబుతా నీ సంగతి" అన్నాడు రామం, జ్వరతీవ్రత బాధలో.

"రామం! చూడు మీ అమ్మ వచ్చింది...పాపం! ఎవరినీ గుర్తుపట్టలేకపోతున్నాడు." అంది వెంకట్రామయ్యగారి భార్య జాలిపడుతున్నట్లు.

"రామం! రామం! యిలా చూడు!" అన్నారు వెంకట్రామయ్యగారు, అతని తల తనవైపు చేత్తో త్రిప్పుతూ, తెచ్చుకున్న అభిమానంతో.

"ఎవరు నువ్వు?..ఎవరు నువ్వు?" అన్నాడు రామం, పిచ్చిగా నవ్వుతూ. అతని వెఱ్ఱి చూపు వెంకట్రామయ్య గారిని వెక్కిరించినట్లు కనిపించింది.

సంధి ప్రేలాపనలో రామం నోట యిటువంటి మాటలు వస్తాయనుకోలేదు

వెంకట్రామయ్య గారు. క్రిందటి రోజు గోదావరీ తీర దృశ్యం కళ్లముందు కట్టి, హృదయంలో కలచింది. రామం ఒళ్ళు తెలియని పరిస్థితిలో అన్న మాటలు, అతని హృదయంలో బాధతో దాగి వెలువడిన ఎదురుప్రశ్నలా అగుపించింది వెంకట్రామయ్య గారికి. ఆ ఎదురుప్రశ్న శూలంలా ఆయన గుండెల్లో గ్రుచ్చుకుని. ఆవేదన ప్రవహించి కడుపులో త్రిప్పగా, యేదో కలవరపడ్డారు.

రామం మరీ పిచ్చిగా నవ్వడం మొదలు పెట్టాడు. కొంతసేపయాక నవ్వు పూర్తిగా అణగిపోయింది. శ్వాస క్రమంగా మాయమయ్యింది.

రామం తల్లి,అమ్మమ్మ సత్తెమ్మగారు, గుండెలు బాదుకుంటూ, రామం శవంపైబడి, యేడ్చి మొత్తుకున్నారు. రత్తప్ప, చంటి, రామం దగ్గరగాదిగాలు పడి భయంతో నుంచున్నారు. చిన్ని, కన్నీరు బలవంతంగా తెచ్చుకుని తుడుచుకుంది. “ఎండలో ప్రయాణం చేసి వచ్చిన వాడికి చలిది అన్నం పెడితే జ్వరం రాదూ విషజ్వరం వచ్చి మింగేసింది కుర్రాణ్ణి” అని గుస గుసలాడారు ప్రక్కింటివాళ్ళు.

చనిపోతూన్న రామం వేసిన ఎదురు ప్రశ్నలో ఏదో అంతరార్థం స్ఫురించింది వెంకట్రామయ్య గారికి. ఇద్దరూ ఒకరినొకరు ఒకే ప్రశ్న వేసుకున్నప్పటికీ ఆ ప్రశ్నల పరిస్థితులలో ప్రత్యేక వ్యత్యాసం కనిపించింది. బాంధవ్యద్వేషాలతో, కుళ్ళి మలినమైన హృదయంతో తాను రామాన్ని “ఎవరు నువ్వు?” అని ప్రశ్నిస్తే, తన ప్రవర్తనకు గుణపాఠం బోధించాలని, పవిత్రహృదయంతో విశ్వమానవ జీవిత సంబంధాలను స్పష్టీకరిస్తూ రామం ఎదురుప్రశ్న వేసినట్లనిపించింది వెంకట్రామయ్యగారికి.

బాహ్యవాతావరణంలో రామంగురించి ఆక్రందించేవారి రోదనలు ప్రతిధ్వనిస్తూ సూదుల్లా వెంకట్రామయ్య గారి శరీరమంతా పోట్లు పొడిచాయి. అంతర్గత వాతావరణంలో రామం అప్రయత్నంగా సంధిలో వేసిన ఎదురుప్రశ్న, అతని పిచ్చునవ్వు, వికటాట్టహాసాలు చేస్తూ ఆయన హృదయాన్ని తూట్లు చేశాయి. ఈ రెంటి ఒత్తిడి, బాధ మద్య వెంకట్రామయ్యగారు నలిగి ము గ్గారు